# వడదెబ్బతో వృద్ధురాలి మృతి

**ఎలిగేడు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన గంగ్ర సత్తెమ్మ (65) ఆదివారం తెల్లవారుజామున వడదెబ్బకు గురై మృతి చెందారు. ఎండల తీవ్రతను తట్టుకోలేక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోవడం గ్రామంలో విషాదాన్ని నింపింది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, ఎండవేడిమి కారణంగా సత్తెమ్మ ఆరోగ్యం క్షీణించి, తట్టుకోలేక చివరికి మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.


వడదెబ్బతో మృతి చెందిన సత్తెమ్మ

# మట్టి లారీలను అడ్డుకున్న లోకపేట గ్రామస్థులు



**ఎలిగేడు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాబాద్ మండలం కొదురుపాక ఎల్లమ్మ చెరువులోనుండి మట్టిని లారీలలో ఓవర్‌లోడ్ చేసి ఎలిగేడు మండలం లోకపేట మీదుగా తరలిస్తున్న లారీలను గ్రామస్థులు ఆదివారం ఆగ్రహంతో అడ్డుకున్నారు.గ్రామస్థులు మాట్లాడుతూ, "కొదురుపాక నుండి మట్టి తీసుకెళ్లడానికి మా గ్రామం మీదుగా రావడం ఏమిటి? నిర్ణీత సమయాల్లో కాకుండా ఇష్టారాజ్యంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నారు. దీంతో రోడ్లు పాడవడమే కాకుండా దుమ్ము, ధూళి విపరీతంగా లేస్తోంది. ఇది మా ఆరోగ్యానికి ప్రమాదకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, కనీసం రోడ్డు వెంట నీటిని చల్లాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుల ఆగ్రహంతో లారీలు నిలిపివేయబడ్డాయి. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

# ఘనంగా పీసీసీ చీఫ్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, మే 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆదివారం పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అనంతరం సంబురాలు నిర్వహించారు. తెల్గమల్ల జగన్ మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షులు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని, దేవుడు ఆయనకు ఆయురారోగ్యాలతో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖాదర్, నాయకులు కర్నాటి కొండల్ రెడ్డి, ఖాదర్ ఖాద్రి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ అలీమ్, ఉప సర్పంచ్ సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, అబ్దుల్ కరీం, కృష్ణ నాయక్, రహీం, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రఫీ, కొండల్ రెడ్డి, ఇస్లావత్ దోలి, లక్ష్మీ, కమిలి, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ తీరు వల్లే నీట్ పేపర్ లీకేజీ

**- ఎన్ఎస్ఈయుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్**
**- వినోద్ జాఖర్ కలిసిన ఫరీద్**



**ఆమనగల్లు, మే 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నీట్ పేపర్ లీకేజీ ఘటన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని ఎన్ఎస్ఈయుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బేగంపేట్ ఓ హోటల్లో ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ జాఖర్ మాట్లాడుతూ.. యువత భవిష్యత్‌తో కేంద్రం ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల్లో పేపర్ లీకేజ్‌లు సాధారణమై పోయాయని ఆరోపించారు. పరీక్ష వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల వైద్య విద్య కోసం కష్టపడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నీట్ పేపర్ లీకేజీ పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపట్టాలని ఆయన సూచించినట్లు ఫరీద్ తెలిపారు.

# నేటి రాశి ఫలాలు



**మేషరాశి**
కొత్త ప్రయత్నాలు ముందుకు సాగవు. బంధువుల నుంచి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. ప్రయాణాలలో మార్పులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఆర్థిక విషయాలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటుంది. శ్రీ విష్ణుమూర్తి నామస్మరణ శుభకరం.

**వృషభరాశి**
ముఖ్యమైన వ్యవహారాలలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. సంతానానికి నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి. శ్రీ వినాయక నామస్మరణ శుభకరం.

**మిధునరాశి**
దూరప్రయాణాలు వాయిదా పడతాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో వాదోపవాదాలకు దిగడం మంచిది కాదు. ముఖ్య కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉంటాయి. శ్రీ హనుమాన్ నామస్మరణ శుభకరం.

**కర్కాటకరాశి**
సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ప్రయాణాలలో కొత్త పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. శ్రీ మల్లికార్జున స్వామి నామస్మరణ శుభకరం

**సింహరాశి**
బంధుమిత్రులతో సేవా కార్యక్రమాలు చేపడతారు. స్థిరాస్తి వివాదాలు పెద్దల సహాయంతో రాజీ చేసుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగాలలో విలువైన పత్రాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. శ్రీ వీరభద్ర నామస్మరణ శుభకరం

**కన్యరాశి**
ఆత్మీయుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కొన్ని విషయాలు ఆశ్చర్యపరుస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి. విద్యార్థులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. దక్షిణామూర్తి నామస్మరణ శుభకరం

**తులరాశి**
ఇంటా బయట విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటాయి. నూతన వస్తులాభాలు పొందుతారు. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగయత్నాలు కలసివస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం నుండి కొంత ఉపశమనం పొందుతారు. వరాహమూర్తి నామస్వర శుభకరం.

**వృశ్చికరాశి**
చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు సాగిస్తారు. మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. శ్రీ వెంకటేశ్వర నామస్మరణ శుభకరం

**ధనస్సురాశి**
ఆరోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్పదు. దీర్ఘకాలిక ఋణాల వలన ఒత్తిడి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల తీసుకోకపోవడం మంచిది. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. లక్ష్మీనరసింహ నామస్మరణ శుభకరం

**మకరరాశి**
స్థిరాస్తి ఒప్పందాలు అనుకూలిస్తాయి. గృహమున బందు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. నూతన ఎ ి రి చ ి య ి వా ల ు న ం తో షా న్ని స్తా ం ు ు . సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. శివనామస్మరణ శుభకరం

**కుంభరాశి**
సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ సమర్ధతను చాటుకుంటారు. వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి ధన సహాయం అందిస్తారు. చేపట్టిన పనులు చకచకా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. కుమారస్వామి నామస్మరణ శుభకరం

**మీనరాశి**
కుటుంబ సభ్యుల ప్రవర్తన వల్ల కొంత చికాకు పెరుగుతుంది. పని ఒత్తిడి అధికమై శిరో బాధలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. సన్నిహితులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. వినాయకుని నామస్మరణ శుభకరం

**(రాశి ఫలాలు నిపుణుల సలహాలతో పరిగణంలోకి తీసుకోవాలి)**


శ్రీ కాలబైరవ ఉపాసకులు
దక్క జంబులయ్య (స్వామి)
9491163914

# భగవద్గీతను రాబోయే తరాలకు అందించాలి

**ఆమనగల్లు, మే 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భగవద్గీతను రాబోయే తరాలకు అందించేలా ప్రతి దేవాలయంలో గీత శ్లోకాలను భక్తులకు వినిపించాలని అభయ్ హిందూ సేవ వ్యవస్థాపకుడు రాధా మనోహర్ దాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు సింగం శీనయ్య ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు, భగవద్గీత ప్రచారకులు రాధా మనోహర్ దాస్ స్వామిజీ, ప్రాంత సహా కోశాధికారి, వనవాసీ కళ్యాణ్ పరిషద్ ముఖ్య వక్త తాడేపల్లి హనుమత్ ప్రసాద్ హాజరై మాట్లాడారు.. హైందవ సంక్షేమమే భారత సంక్షేమమన్నారు. మనమంతా హిందువులమనే ఐక్యతా భావనను గుండెల్లో



నింపుకుని జీవించినప్పుడే దేశాన్ని, సంస్కృతిని, పురాతన దేవాలయాలను కాపాడుకోగలమన్నారు. భావితరాలకు సనాతన ధర్మ విశిష్టతను తెలియజేసేందుకు హిందూ సమ్మేళనాలు దోహదపడతాయన్నారు. హిందూ ధర్మపరిరక్షణకు సంఘటితం కావాలని అన్నారు. భగవద్గీతలోని శ్లోకాలను చదివి, అర్థాలను వివరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, మాజీ కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్, గోరటి గీత నర్సింహా, దివ్య శ్రీకాంత్ సింగ్, ఆర్ఎస్ఎస్ సభ్యులు అంజయ్య, ప్రభాకర్, అల్లాజీ గౌడ్, దొంతూ సత్యం, శేఖర్, శ్రీను, శ్రీను నాయక్, గణేష్, పాతకోట శ్రీశైలం, వంశీ, ఆనంద్, భాస్కర్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అందర్ బహార్ -- పేకాటరాయుళ్ల అరెస్ట్

**-దామగట్లలో పోలీసుల దాడి -**
**- రూ.10,630 నగదు స్వాధీనం**

**నందికొట్కూరు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం సూచనలతో బ్రాహ్మణకొట్టుకురు ఎస్సై మణికంఠ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దామగట్ల గ్రామంలో సుంకలమ్మ గుడి సమీపంలోని కుంట కంపచెట్ల వద్ద దాడి నిర్వహించారు.ఈ సందర్భంగా అందర్ బహార్ మరియు పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుండి రూ.10,630 నగదు, 52



పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మణికంఠ మీడియాకు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి జూదక్రీడలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. "ఎక్కడైనా అక్రమ వ్యాపారాలు లేదా జూద స్థావరాలు నడుస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఉల్లంపల్లి--బొమ్మనపల్లి మధ్య భారీ అగ్ని ప్రమాదం



**హుస్నాబాద్, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి మరియు బొమ్మనపల్లి గ్రామాల మధ్య ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. సుమారు 30--35 ఎకరాల వరకు చెట్లు, గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. బోర్లు, బావులు, కరెంటు వైర్లు, పైపులు కూడా మంటల్లో దెబ్బతిన్నాయి.పొలాల్లో ఉన్న గడ్డి కట్టలు, కొత్తగా చుట్టిన కట్టలు మంటల్లో పూర్తిగా కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కత్తుల శ్రీకాంత్‌కు చెందిన 150 గడ్డి కట్టలు, కత్తుల రాజయ్యకు చెందిన 200 గడ్డి కట్టలు, మైలగని సతీష్‌కు చెందిన కరెంట్ షాట్ డబ్బా, కత్తుల రమేష్‌కు చెందిన కరెంట్ వైర్లు, పైపులు, మామిడి రమేష్‌కు చెందిన గడ్డి కట్టలు మంటల్లో నాశనమయ్యాయి.ఈ ప్రమాదంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన పరిహారం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. నష్టపోయిన రైతుల పూర్తి వివరాలు అధికారులు సేకరిస్తున్నారు.

# జీనియస్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన



**కరీంనగర్,మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ భగత్ నగర్‌లోని శ్రీ చైతన్య యూత్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జీనియస్ ర్యాంకింగ్ చెస్ పోటీలు విశేష స్పందన పొందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 125 మంది చదరంగం క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు (రూరల్) సిఐ ఆర్. కృష్ణ, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య పాల్గొని మొదటి ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ, చదరంగం పిల్లలలో మేధాశక్తితో పాటు ఏకాగ్రతను పెంపొందిస్తుందని అన్నారు.జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కనకయ్య మాట్లాడుతూ, పిల్లల ప్రతిభను వెలికితీయడానికే ర్యాంకింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ టోర్నమెంట్ లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజెస్ సహకారంతో నిర్వహించామని తెలిపారు.కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్ప్రైజెస్ మేనేజర్ శ్రీనివాస్, ఎండి కుమారస్వామి, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు పండుగ నాగరాజు, జిల్లా డెమొక్రటిక్ డెవలప్మెంట్ కార్యదర్శులు కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, రాకేష్, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, అరుణ్, ఆర్బిటర్లు అభిరామ్, నితిన్, రేవిక్, స్వాతి, ప్రభుదేవా, వరుణ్, విశాల్, అజయ్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.చదరంగం పోటీల్లో పిల్లల ఉత్సాహం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# కేంద్ర పారా మిలటరీ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటు దిశగా ముందడుగు



**కరీంనగర్, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లాలో కేంద్ర పారా మిలటరీ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటు యత్నాలు ఫలితాన్నిచ్చాయి. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఆర్పీఎఫ్ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి.ఈ మేరకు ఆయన ఇటీవల సంబంధిత విభాగాల డీజీపీలతో చర్చలు జరిపి, రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే గ్రూప్ సెంటర్ ఏర్పాటు సాధ్యమని సూచించారు. అనంతరం మార్చి 10న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి, కరీంనగర్‌లో తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు.కేంద్ర మంత్రి లేఖకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్ పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన సీసీఎల్ఏ రాష్ట్ర కేబినెట్‌కు పంపింది. ఈరోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం మానకొండూరులోని వెల్దిలో 4 ఎకరాలు, చొప్పదండిలోని రుక్మాపూర్‌లో 5 ఎకరాలు, గన్నేరువరంలో 5 ఎకరాలు వెరసి మొత్తం 14 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఆమోదం తెలిపింది.దీంతో కరీంనగర్‌లో పారామిలటరీ బలగాల గ్రూప్ సెంటర్ ఏర్పాటు దిశగా మరో అడుగు ముందుకు పడింది. త్వరలోనే కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది.కరీంనగర్‌లో గ్రూప్ సెంటర్ ఏర్పాటుతో భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని భావిస్తున్నారు.

# జిల్లాలో వేగవంతమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ


**కరీంనగర్, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలో ఇప్పటివరకు సుమారు 75 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వెల్లడించారు. మిగిలిన కొనుగోళ్లను వచ్చే పది రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు.ఇప్పటి వరకు 68 కొనుగోలు కేంద్రాల్లో మొత్తం 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, దీని విలువ రూ.544.74 కోట్లు అని కలెక్టర్ వివరించారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.407.21 కోట్లు జమ చేసినట్లు, మిగిలిన మొత్తాన్ని ఒకటి రెండు రోజుల్లో జమ చేస్తామని తెలిపారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని



పేర్కొన్నారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, టార్పాలిన్లు, గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉంచామని వివరించారు.పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష, అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ చిత్రా మిశ్రా హామీ ఇచ్చారు.

# పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



**నందికొట్కూరు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం సంకిరేణిపల్లెలో శనివారం జరిగిన పిడుగుపాటు ఘటనలో గొర్రెల కాపరి ప్రాణాలు కోల్పోవడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.నందికొట్కూరు పట్టణానికి చెందిన వడ్డే రాముడు (60) గొర్రెలు కాయడానికి వెళ్లగా ఆకస్మికంగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి వడ్డేపేటకు చెందిన వ్యక్తిగా నిర్ధారించారు.మృతుడు ఎలాంటి ఆస్తి లేక కేవలం కూలి పనులపై ఆధారపడి జీవనం సాగించిన నిరుపేద కుటుంబానికి చెందినవాడు. ముగ్గురు కుమారులు రోడ్డున పడ్డ వైనం గ్రామస్థుల హృదయాలను కలచివేసింది.ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్గ్రేషియా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**-ఎలిగేడు ఏఎస్సై శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం**

**ఎలిగేడు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



సైబర్ మోసాల పై అవగాహన కల్పిస్తున్న ఏ ఎస్ ఐ శ్రీనివాస్

ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం ఉదయం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు."ఫేక్ ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడమే మంచిది. ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి. అజ్ఞాత వ్యక్తులకు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలి" అని సూచించారు.ఈ సందర్భంగా ఆయన భక్తులకు, గ్రామస్థులకు నేరుగా అవగాహన కల్పిస్తూ, "ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటేనే సైబర్ మోసాలను అరికట్టగలం" అని అన్నారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

**-పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం**



**ఎలిగేడు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం గ్రామ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, 2వ వార్డు సభ్యుడు పల్లె కార్తీక్‌ను గ్రామస్థులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ, "గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరం. ఈ సన్మానాన్ని ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, మార్కండేయ గుడి చైర్మన్ వెంగళదాస్ బాస్కర్, బూర్ల సత్యనారాయణ, బూర్ల వెంకటసత్యం, రాజేశం, నాగరాజు, వెంగళదాసు శ్రీనివాస్, జనార్ధన్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో ప్రజాప్రతినిధులకు ఇచ్చిన ఈ సన్మానం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# శ్రీశైలంలో అన్నప్రసాద వితరణ పరిశీలన

**-భక్తులకు స్వయంగా వడ్డించిన ఈవో శ్రీనివాసరావు**



**శ్రీశైలం, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాద వితరణను పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు.ముందుగా అన్నప్రసాద భవనంలోని విరాళాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, తరువాత అన్నప్రసాద వితరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి, వారితో నేరుగా మాట్లాడి వడ్డన, రుచి, సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.అధికారులతో మాట్లాడుతూ, "అన్నప్రసాద వితరణలో శివసేవకుల సేవలను విరివిగా వినియోగించుకోవాలి. వారికి వడ్డన విధానం, భక్తులతో మర్యాదగా మెలగడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలి. ప్రతి హాలులో వడ్డన సజావుగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలి. వండిన ప్రతి వంటకం ప్రతీ భక్తుడికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలి" అని సూచించారు.అన్నప్రసాద వంటశాలలో, వితరణ హాలుల్లో, భవన ప్రాంగణంలో శుచీశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. "వంటకాలు రుచికరంగా ఉండేలా ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వాడాలి. భక్తులకు అందించే అన్నప్రసాదం శ్రద్ధ, శుభ్రత, రుచితో కూడి ఉండాలి" అని స్పష్టం చేశారు.

# దాహార్తితో జనవాసాల్లోకి జింక పిల్ల

**-మర్రిగూడలో కలకలం**

**-- అడవికి తిరిగి పంపిన అధికారులు**



**మర్రిగూడ, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మర్రిగూడ మండల కేంద్రంలోని లెంకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఒక జింక పిల్ల దాహార్తితో గ్రామ శివారు అడవిని వదిలి జనవాసాల్లోకి వచ్చింది. గ్రామస్తులు గమనించి పట్టుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు తన సిబ్బందిని పంపి జింక పిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్కు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం జింక పిల్ల ఆరోగ్యంగా ఉందని, సాయంత్రం అడవిలో తిరిగి వదిలిపెడతామని తెలిపారు.గ్రామంలో జింక పిల్ల ప్రత్యక్షం కావడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రకృతి దాహార్తి కారణంగా అడవి జంతువులు గ్రామాల వైపు వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు



**కరీంనగర్, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హనుమాన్ నగర్ రోడ్ నం. 2లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కాలనీ వాసులు ఏకగ్రీవంగా సమావేశమై శ్రీ ప్రసన్నాంజనేయ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీకి అధ్యక్షుడిగా టి. భూపతి రెడ్డి, కార్యదర్శిగా బి. సుధాకర్, కోశాధికారిగా కె. గౌరేశం, ఉపాధ్యక్షుడిగా కె. ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా పి. రవీందర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా జీ. శ్రీనివాస్, డి. నవీన్ కుమార్, ఎస్.ఆర్. రవీంద్రాచారి, కె. శ్యామ్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గౌరవ అధ్యక్షులుగా ఉప్పోజు వెంకటరాజం, అన్నాడి తిరుపతి రెడ్డి ఎంపికయ్యారు. అనంతరం అధ్యక్షుడు భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం అందరం కలసికట్టుగా కృషి చేస్తాం. భేదాభిప్రాయాలు లేకుండా ఒకే కుటుంబంలా కలసి మెలసి ఉంటాం అని తెలిపారు.కాలనీ వాసుల ఐక్యతతో ఏర్పడిన ఈ సొసైటీ, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు పునాది వేస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు





### ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలు



**నందికొట్కూరు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేరాలను ముందస్తుగా గుర్తించి అరికట్టేందుకు, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచేందుకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరంగా నిర్వహించారు.ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా, ముఖ్యంగా మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఈ తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు జరిపారు. సరైన ధ్రువపత్రాలు లేని పలు మోటార్ సైకిళ్లు, ఆటోలు స్వాధీనం చేసుకోవడంతో పాటు నాటు సారాయి, అక్రమ మద్యం స్వాధీనం చేసి కేసులు నమోదు చేశారు.వెలుగోడు పరిధిలోని రేగడగూడూరు, నందికొట్కూరు టౌన్ పరిధిలోని షికారిపేట, సుండిపెంట పరిధిలోని లంబాడి తండా, జూపాడుబంగ్లా పరిధిలోని తుడిచెర్ల, ఎన్. రాచర్ల పరిధిలోని సీతమ్మతండా గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక బలగాలతో ప్రతి ఇల్లు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.పోలీసు అధికారులు మాట్లాడుతూ, "జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ లేదు. ప్రజల రక్షణే మా మొదటి ప్రాధాన్యత. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో, పట్టణాల్లో అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి" అని తెలిపారు.ఈ ఆపరేషన్లలో సంబంధిత ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జలధార పారితేనే రైతన్న ముఖంలో వెలుగు

**-జలహారతి కార్యక్రమంతో సాగునీటి భరోసా**

**- 350 ఎకరాల్లో పచ్చని ఆశలు**






**నందికొట్కూరు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని నాగటూర్ గ్రామం... పేరు చిన్నదైనా, అక్కడి రైతుల కష్టం ఎంతో పెద్దది. చెరువులు, కుంటలు లేని ఈ మారుమూల గ్రామానికి జీవనాధారం ఒక్కటే -- నీలగండి నుండి కృష్ణా నది వరకు ప్రవహించే ప్రధాన కాలువ. కేసీ కెనాల్ నీళ్లు ఈ కాలువలో ప్రవహించి, పిల్లకాల్వల ద్వారా పొలాలకు చేరుతాయి. ఆ నీరే నాగటూర్ రైతుల పంటలకు ప్రాణాధారం.ఈ కాలువ కింద దాదాపు 150 మంది రైతులకు చెందిన 350 ఎకరాల సాగుభూమి ఉంది. వరి, మొక్కజొన్న, మినుములు, కందులు వంటి పంటలు ఇక్కడ ప్రధానంగా సాగుతుంటాయి. అయితే గత కొన్ని నెలలుగా కాలువలో భారీగా పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం తగ్గిపోయింది. పైభాగంలోనే నీరు నిలిచిపోవడంతో కింది భూములకు నీళ్లు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా గణనీయంగా పడిపోయాయి.ఈ సమస్యను గుర్తించిన గ్రామ ప్రజలు, రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన జిల్లా యంత్రాంగం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులకు ఆమోదం తెలిపింది. రూ.6.12 లక్షల వ్యయంతో పనులు మంజూరు చేసి ఆలస్యం చేయకుండా ప్రారంభించారు. గత రెండు వారాలుగా ప్రతిరోజూ సుమారు 120 మంది శ్రామికులు కాలువలో పూడికతీత పనులు చేస్తున్నారు. శ్రమజీవుల చెమటతో కాలువ మళ్లీ పునర్జీవం పొందుతోంది.ఎన్నాళ్లుగానో పూడికతో మూసుకుపోయిన మార్గం ఇప్పుడు మళ్లీ నీటి ప్రవాహానికి సిద్ధమవుతోంది. కాలువలో పూడిక తొలగించడంతో నీరు సాఫీగా కింది భూముల వరకు చేరుతోంది. దీంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. రానున్న పంటకాలంలో సాగుభూమి పెరగడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ, "జలధార -- జలహారతి కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఉపాధి హామీ పథకాన్ని కేవలం కూలి పనులకే పరిమితం చేయకుండా, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. నాగటూర్ కాలువ పూడికతీత ద్వారా రైతులకు సాగునీరు అందడమే కాకుండా భూసార పరిరక్షణ, దిగుబడి పెరుగుదల, గ్రామీణ ఉపాధి -- అన్నీ కలిసిన ప్రయోజనం కలుగుతోంది. రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది... గ్రామం బాగుంటే జిల్లా అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొన్నారు.గ్రామస్థులు కూడా జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలుపుతూ, "ఎన్నో సంవత్సరాల తరువాత మా కాలువకు మళ్లీ జీవం వచ్చింది. ఇప్పుడు మా పొలాలకు నీళ్లు వస్తున్నాయి. ఈసారి పంట బాగుంటుందనే నమ్మకం కలిగింది" అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాగటూర్ గ్రామం నేడు ఉపాధి హామీ పనులు గ్రామీణ జీవితాల్లో ఎలా మార్పు తీసుకురాగలవో ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది.

# పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చెయ్యాలి

**- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**




**కరీంనగర్, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు.ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.45 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు చేరిన 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు.రైతులను తాలు, తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేయవద్దని సూచిస్తూ, గన్ని బ్యాగుల కొరత లేదని, 21 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గోదాములు, లారీలు, హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులకు మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.అనంతరం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్ తదితరులు ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్లకు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం నుంచి జరగనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను అద్భుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ ప్లాన్ ప్రకారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఆర్డీవో శ్రీకాంత్ చక్రవర్తి, మహిళా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీఓ గీత, మెప్మా పీడీ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయడం, మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయడం రాష్ట్ర యంత్రాంగం ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

## డాక్టర్ సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన జూపల్లి భాస్కర్‌రావు



**చారకొండ, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ సత్యనారాయణ అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశారు.విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. "మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చారు.అంతేకాకుండా ఆయన కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో జూపల్లి భాస్కర్‌రావు యువసేన అధ్యక్షుడు ఎం.డి. సిరాజ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## అర్హులైనవారు ఆసరా పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజా సంక్షేమమే లక్ష్యం -- యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్**



**తలకొండపల్లి, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ అన్నా సారథ్యంలో ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో గ్రామపంచాయతీ కార్యాలయాలలో నూతన పెన్షన్ దారుల దరఖాస్తులను మే 22 నుండి మే 25 వరకు స్వీకరిస్తున్నట్లు యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబం పాస్ ఫోటో, ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, ఓటర్ కార్డ్ జిరాక్స్‌లతో పాటు వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరై ఆసరా పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు."ప్రతి అర్హుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా చర్యలు తీసుకుంటాం. ప్రజా సంక్షేమమే మా లక్ష్యం" అని సురేష్ స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా రామకృష్ణ



**ఆమనగల్లు, మే 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన తల్లోజు రామకృష్ణ ను నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వోరగంటి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, జైలు జీవితం గడిపిన రామకృష్ణ కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఉద్యమ అమరుల కుటుంబాలకు అండగా నిలవాలని, ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లోజు రామకృష్ణ మాట్లాడుతూ.. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ పాల్గొన్నారు.

## వంగూరులో ఎస్సై మాధవరెడ్డికి ఘన స్వాగతం

**-కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు**



**వంగూరు, మే 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై మాధవరెడ్డికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, జిల్లా నాయకులు జయప్రసాద్ రావు, గాఫుర్, మీసాల స్వామి, జనార్ధన్, సైదులు, మల్లేష్ యాదవ్, కృష్ణ, పర్వతాలు, కృష్ణయ్య, వెంకట్ గౌడ్, చంద్రశేఖర్, శంకర్, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్సై మాధవరెడ్డి విజయవంతంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

